బండబారిన బతుకులు..

- తుర్కకాశీల దుర్భర జీవనం
- కండలు కరిగినా కడుపు నిండని పరిస్థితి
- ఏళ్లుగా కులవృత్తిలోనే మగ్గుతున్న వైనం
- మౌలిక వసతులు లేక ఇక్కట్లు
- చదువుకు దూరమవుతున్న చిన్నారులు
- సమస్యల వలయంలో తుర్కాశీపల్లె


గుడిసెల్లో జీవిస్తున్న ప్రజలు


ఇంటిపట్టునే బడీడు పిల్లలు


బండలు కొడుతున్న తుర్కాశీలు

సిరిసిల్లఅర్బన్: పగలనక, రాత్రినక కండలు పిండి చేస్తూ బండలు కొడుతూ, వాటిని అమ్ముకుని వచ్చే అరకొర ఆదాయంతో తుర్కాశీలు బతుకులీడుస్తున్నారు. వంశపారపర్యంగా వచ్చిన వృత్తినే నమ్ముకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. తాత ముత్తాతల నుంచి వచ్చిన కుల వృత్తిపై ఆధారపడి రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నారు. నేటి తరం కూడా అదే బాటలో పయణిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన తమ రాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను పట్టించుకునే పాలకులే, అధికారులే లేరని వాపోతున్నారు.

బండలు కొడితేనే కడుపు నిండేది

కొండలను పిండి చేసే సత్తా ఉన్న కూడా వారి జీవితాలు మాత్రం బండ బారుతున్నాయి. వంశ పారపర్యంగా కుల వృత్తినే నమ్ముకుంటూ, ఉదయం నుంచి సాయంత్రం వరకు రాళ్లు కొట్టగా వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఫారెస్టు భూముల్లో రాళ్లు కొడితే సంబంధిత అధికారులు అడ్డుకుంటున్నారని, ఉన్న ఊరిని వదిలి వలస బాట పడుతున్నారు. చదువుకునే స్తోమత లేక ఇదే వృత్తిలో కొనసాగుతున్నామని ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గుట్టలున్న చోట రాళ్లు కొట్టేందుకు అనుమతులివ్వాలని కోరుతున్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో..

రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా పేరు తెచ్చుకున్న ఈ పల్లె ప్రజలు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. సిరిసిల్ల పట్టణంలో విలీనమైన పెద్దూరు గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న తుర్కాశీపల్లెలో సుమారు 100 కుటుంబాలకు పైగా దాదాపు 400 మంది జీవనం సాగిస్తున్నారు. బండ రాళ్లు కొడుతూ జీవితం గడిపే వీరి కుటుంబాలు కూడా పూర్తిగా బండ బారిపోయాయి. కనీస వసతులు లేక దుర్భర జీవితం గడుపుతున్నారు.

➡ ప్రభుత్వం భూమిలో 100 పైగా జీవిస్తున్న కుటుంబాల్లో కొంతమంది ఇప్పటికీ గుడిసెల్లోనే జీవిస్తూ కాలం వెల్లదీస్తున్నారు.
➡ డ్రెయినేజీలు మచ్చుకైనా కనిపించవు.
➡ వీధి లైట్లు, తాగేందుకు మంచి నీటి సౌకర్యం కల్పించలేదు.
➡ మిషన్ భగీరథ నీరు కలుషితంగా వస్తున్నట్లు తెలిపారు.
➡ పిల్లలు పాఠశాలలకు వెళ్లే అవకాశం లేదు. ఒకవేళ వెళ్లాల్సివస్తే సుమారు రెండు కిలోమీటర్లు దూరం నడిచి వెళ్లాలి.
➡ అంగన్‌వాడీ కేంద్రం కూడా లేకపోవడంతో పిల్లలకు పౌష్టికాహారం అందక పోషకాహార లోపంతో బాధపడుతున్నారు.
➡ బండలు కొడుతూ వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబాలను నెట్టుకువస్తున్న వీరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి కేటీఆర్‌ను కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



అంగన్‌వాడీ కేంద్రం దాదాపు కిలోమీటర్ల దురంలో ఉంది. 50 మందికిపైగా చిన్నారులు ఉన్నారు. అంత దూరం వెళ్లలేకపోతున్నారు. కుక్కలు బెడద ఎక్కువగా ఉండడంతో పాఠశాలకు వెళ్లేవారు కూడా వెళ్లడం లేదు. అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని చాలాసార్లు అధికారులకు తెలిపిన కూడా పట్టించుకోవడం లేదు.
– సయ్యద్ రేష్మ, తుర్కాశీపల్లె

రాళ్లు కొట్టేందుకు అనుమతులివ్వాలి



తాత ముత్తాతల నుంచి రాళ్లు కొట్టుకుంటూ, వాటిని అమ్ముకుంటూ కుటుంబాలను సాకుతున్నాం. కాని ప్రస్తుతం ఉపాధి లేకుండా వలస వెళుతున్నాం. కానీ ఇప్పుడు ఫారెస్టు అధికారులు రాళ్లను కొడితే బెదిరింపులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గుట్టల్లో రాళ్లు కొట్టుకోడానికి అనుమతులివ్వాలి.
– ఎస్‌కె.ఆలీ, మసీద్ కమిటీ అధ్యక్షుడు తుర్కాశీపల్లె

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి



100కుపైగా కుటుంబాలు జీవిస్తున్న ఈ పల్లెలో 19 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరయ్యాయి. మిగతా కొందరు ఇళ్లు కట్టుకోగా మరికొందరు గుడిసెల్లో జీవిస్తున్నారు. అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలి. అలాగే గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలివ్వాలి. కాలనీలో అన్ని రకాల వసతులు కల్పించాలి.
– సయ్యద్ మౌలాన్ బి, తుర్కాశీపల్లె

క్లుప్తంగా

భవన కార్మికులను ఆదుకోవాలి


కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: కాయకష్టం చేసుకుని జీవించే తమను ప్రభుత్వం ఆదుకోవాలని భవన కార్మికుల జిల్లా సంఘం గాజుల పోశెట్టి బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. కార్మికుల సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, 2018 నుంచి ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకున్న కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. 55 ఏళ్ల నిండిన ప్రతి కార్మికుడికి రూ.5 వేలు సామాజిక పింఛన్ ద్వారా అందించాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై రాతపూర్వకంగా విన్నవించారు. సంఘం ప్రధాన కార్యదర్శి కడారి రాములు పాల్గొన్నారు.

పేస్కేల్ వర్తింపజేయాలి


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

సిరిసిల్లటౌన్: ఉపాధి హామీ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌కు విన్నవించారు. బుధవారం కలెక్టర్ ఆఫీసుకు విచ్చేసిన ఉద్యోగులు తమ సమస్యలను ఆయనతో వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, గ్రామ పంచాయితీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న తమకు సరైన గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ జిల్లా జేఏసీ కన్వీనర్ గొడిసెల రమేశ్, గంగాజల, జ్యోతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం అందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

తంగళ్లపల్లి: స్థానిక పీహెచ్‌సీలో బుధవారం క్షయ వ్యాధిగ్రస్తులకు నాలుగవ విడత పౌష్టికాహారాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 20 మందికి పౌష్టికాహారం ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందజేసినట్లు మెడికల్ అధికారి స్నేహ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి బొద్దు నారాయణ, చైర్మన్ గుడ్ల రవి, వైస్‌చైర్మన్ వేణు కుమార్, కోశాధికారి శివప్రసాద్, సభ్యులు ఆనందం, సతీశ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

గౌడ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశం

వేములవాడరూరల్: మండలంలోని మర్రిపల్లి గౌడ సంఘం అధ్యక్షుడిగా జాగిరి వెంకటేశంగౌడ్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఇల్లందుల లచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా తీగల రాములు, కార్యవర్గ సభ్యులుగా బత్తిని ఎల్లయ్య, సుధవేని ఎల్లయ్య, పులి శ్రీనివాస్, ఇల్లందుల నారాయణ, బత్తిని శ్రీనివాస్, బోనగారి చంద్రయ్యను ఎన్నుకున్నారు.

శివసాయి ఆలయ కమిటీ

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్లలో శివసాయి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గుండ వెంకటేశ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా లక్కం రఘు, కోశాధికారిగా దర్శనాల రాజశేఖర్, కార్యదర్శిగా గంగారాం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా సంకోజీ రమేశ్, సలహాదారులుగా జెట్టి హన్మాండ్లు, దాదె జలపతి, శ్రీనివాస్, లకావత్ బాలాజీ, కార్యవర్గ సభ్యులుగా గంగారాం సంపత్, లింగంపెల్లి తిరుపతి, గాజుల నాగరాజు ఎన్నికయ్యారు.

సెస్ గ్రామ ప్రతినిధులు వీరే..

ఇల్లంతకుంట: మండలంలోని సిరికొండ గ్రామ సెస్ ప్రతినిధులుగా కమలాకర్‌రెడ్డి, పయ్యావుల ఎల్లంలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.
వేములవాడరూరల్: మండలంలోని మర్రిపల్లి గ్రామంలో సెస్ గ్రామ ప్రతినిధులుగా తుపాకుల మల్లేశం, గుమ్మడి శ్రీనివాస్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
గంభీరావుపేట: సెస్ గంభీరావుపేట గ్రామ ప్రతినిధుల ఎన్నిక బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగింది. ప్రతినిధులుగా సిరిపురం అంజయ్య, పిట్ల నర్సిం ఎన్నికయ్యారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ సెస్ ప్రతినిధులుగా నాగిల్లి పెద్ద శ్రీనివాస్‌రెడ్డి, బడె కాశయ్య ఎన్నికయ్యారు.
కోనరావుపేట: మండలం కనగర్తిలో సెస్ ప్రతినిధులుగా బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, సోల్పాటి బాపురెడ్డి ఎన్నికయినట్లు సర్పంచ్ భారతి తెలిపారు.
తంగళ్లపల్లి: మండలంలోని కేసీఆర్‌నగర్ సముదాయంలో అడిచెర్ల శ్రీధర్, గుండ్రాటి పల్లవి, బాలమల్లుపల్లెలో కస్తూరి ప్రతాపరెడ్డి, నల్లవేని శ్రీనివాస్, పాపయ్యపల్లెలో నక్క తిరుపతిని సెస్ గ్రామ ప్రతినిధులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఆగయ్య

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య బుధవారం భూమిపూజ చేశారు. మండలంలోని గుండారంలో రూ.20 లక్షలతో చేపట్టనున్న గ్రామపంచాయతీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి, హరిదాస్ నగర్‌లో ఇల్లు లేని నిరుపేదలకు 18, బండలింగంపల్లిలో 40 ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ భాస్కర్‌గౌడ్, సర్పంచులు భూక్య శంకర్, కొత్తపల్లి వాణి, మాజీ ఏఎంసీ చైర్మన్ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీలు పద్మ, బాబు, ఉపసర్పంచ్ బాలయ్య, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు భాస్కర్, దేవయ్య, నాగరాజు, ప్రభాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ



తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు స్వీయ రక్షణకు మాస్టర్ వొద్నాల శ్రీనివాస్ విద్యార్థులకు కుంగ్‌ఫూలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగవెల్లి పట్నాలు



కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో బీరయ్య కామరాతి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం నాగవెల్లి పట్నాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పూజలు చేశారు. ఈ కార్యక్రమాలకు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, బీరప్ప ఆలయ కమిటీ నాయకులు వీరవేణి తిరుపతి, ఎల్లయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

విద్యుత్ బిల్లు చెల్లింపు తేదీల మార్పు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో కరెంట్ బిల్లు తీసుకునే తేదీల్లో మార్పు జరిగినట్లు సెస్ ఏఈ ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ నెల 9న కాకుండా 13, 18, 21 తేదీల్లో వాటర్ ట్యాంక్ వద్ద సెస్ సిబ్బంది బిల్లులు తీసుకుంటారని, అలాగే 26 నుంచి రామాలయం వెనక గల సెస్ ఆఫీస్‌లో బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. సెస్ వినియోగదారులు ఈ మార్పులను గమనించి సహకరించాలని కోరారు.

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని బద్దెనపల్లి-సారంపల్లి టెక్స్‌టైల్ పార్కు గేటు వద్ద బుధవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యూత్ జిల్లా నాయకుడు, దళిత సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సిలివేరి చిరంజీవి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులను తగ్గిస్తే రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులను కేటాయించి ఉపాధి కూలీలకు భరోసా కల్పించిందని కొనియాడారు. దళితబంధుకు అధిక మొత్తంలో నిధులు విడుదలపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దొంతినేని చంద్రారావు, కొక్కిరాల ఆగం రావు, పన్యాల శ్రీనివాస్ రెడ్డి, ఇమ్మనేని అమర్ రావు, చెన్నమనేని రాజేశ్వరరావు, గుంటి మహేష్, శ్రీనివాస్, గుగ్గిళ్ల కృష్ణ గౌడ్, ఎండీ.హోలీ, శ్రవణ్, ఆంటోని, రాజు, స్టెఫ్ఫీ, విక్రమ్, ప్రవీణ్, దేవయ్య, దేవరాజు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సెస్ డైరెక్టర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చంద్రగిరి గ్రామంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను వేములవాడ అర్బన్ మండల సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు బుధవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యుత్ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, సర్పంచ్ రాసూరి రాజేశం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి


ఓబులాపూర్‌లో ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న కంటి వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య కోరారు. బుధవారం 26వ వార్డులో జరిగిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని అన్ని వార్డుల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ ఆకుల కృష్ణ, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.
తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో బుధవారం నేరెళ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నందగిరి నర్సయ్య, ఎంపీటీసీ రాగుల రాజిరెడ్డి, మెడికల్ అధికారి రేఖ పాల్గొన్నారు.
కోనరావుపేట: మండలం కొండాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ చంద్రయ్యగౌడ్ బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ దేవయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో రాజు, వైద్యాధికారి వేణు మాధవ్, ఉపసర్పంచ్ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతు నొక్కే ప్రయత్నం

సిరిసిల్లఅర్బన్: సెస్ సంస్థలో ప్రశ్నించే గొంతుకలను నొక్కేందుకే సెస్ పాలకవర్గం ప్రయత్నిస్తోందని మాజీ సెస్ ప్రతినిధి, పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ ఆరోపించారు. సెస్ పాలకవర్గం పని తీరును, సమావేశాల్లో ప్రశ్నించకుండా ఉండేందుకు సెస్ ప్రతినిధుల సభ్యుల సంఖ్యను తగ్గించారన్నారు. కేవలం ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడిందన్నారు. గతంలో సిరిసిల్ల పట్టణ పరిధిలో సెస్ ప్రతినిధుల సంఖ్య 14 ఉండగా, నాలుగుకు కుదించారన్నారు. అదే సెస్ డైరెక్టర్ స్థానాలను 11 నుంచి 15కి పెంచిన పాలకవర్గం సెస్ ప్రతినిధుల సంఖ్యను ఎందుకు కుదించారో ప్రజలకు తెలపాలన్నారు.

పరామర్శ

ముస్తాబాద్: ఇటీవల మృతి చెందిన మండలంలోని బందనకల్ మాజీ సర్పంచ్ శివానందం కుటుంబాన్ని ఎంపీపీ జనగామ శరత్ రావు బుధవారం పరామర్శించారు. రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేసిన శివానందం తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేశారన్నారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటామన్నారు. ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, చిగురు నరేశ్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్


మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా బీసీలు ఉండగా కేవలం రూ.6వేల కోట్లను కేటాయించడం వివక్ష చూపడమేనని విమర్శించారు. వార్షిక బడ్జెట్‌లో బీసీలను మోసం చేశారని అన్నారు సిరిసిల్ల డివిజన్ ఇన్‌చార్జి ఇల్లందుల ప్రకాశ్, మండల అధ్యక్షుడు మట్టె నరేశ్, పట్టణాధ్యక్షుడు సుజిత్‌కుమార్, నాయకులు రాజు, అఖిల్, అనిల్, శ్రీనివాస్, నవీన్, కృష్ణ ఉన్నారు.

పేద వృద్ధులకు పింఛన్ల పంపిణీ


పింఛన్ నగదు అందిస్తున్న వెంకటేశ్వర్‌రావు

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో పేద వృద్ధ మహిళలకు జేఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్ జూకంటి వెంకటేశ్వర్‌రావు బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ రాజమల్లు, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌లో యువతకు ప్రాధాన్యం’

బోయినపల్లి: బీఆర్‌ఎస్‌లో యువతకు ప్రాధాన్యత ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య అన్నారు. బోయినపల్లిలో యువజన శాఖ అధ్యక్షుడు కట్ట గోవర్ధన్ ఆధ్వర్యంలో యువజన శాఖ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపైన చేసే అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. అలాగే ప్రతి గడపకు బీఆర్‌ఎస్ పథకాలను తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వై మండలాధ్యక్షుడు కట్ట గోవర్ధన్, ఎంఐఎఫ్ జిల్లా అధ్యక్షుడు కత్తెరపాక సుధాకర్, గజ్జెల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన


పంటను పరిశీలిస్తున్న అధికారులు

బోయినపల్లి: మండలంలోని అనంతపల్లిలో వ్యవసాయాధికారి ప్రణీత ఆధ్వర్యంలో మంగళవారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంట పిలక దశలో ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా నత్రజని ఎరువులు వాడితే అగ్గితెగులు, మొగిపురుగు అధికమవుతుందన్నారు. ఆమెతోపాటు ఏఈవో శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు అందజేత

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ ఐల లచ్చయ్య కుమారుడు శివరాం విద్యార్థులకు ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇల్లందుల శంకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశం

వీర్నపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయులు రవి ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ పద్మజ పాల్గొని మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులను పరీక్ష సమయంలో సోషల్ మీడియాకు దూరం ఉంచాలన్నారు. దీనిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం కృష్ణవేణి, కవిత, జనార్దన్, శ్రీనివాస్, మమత, శ్రీలత, హారిక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లక్ష రుణమాఫీ హామీ అమలెక్కడ.?

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రూ.90 వేల వరకే రుణమాఫీ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు గజ్జెల దేవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం లక్ష రుణమాఫీ చేయాలని, లేని పక్షంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.